గందె వేణుకు ఆర్యవైశ్య లైమ్‌లైట్ అవార్డు

పురస్కారం అందించిన మంత్రి శ్రీధర్‌బాబు

మంత్రి శ్రీధర్‌బాబు నుంచి అవార్డు అందుకుంటున్న గందె వేణు

జనగామ, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ ఆర్యవైశ్య సంఘం నాయకుడు గందె వేణుకు ఆర్యవైశ్య లైమ్‌లైట్ అవార్డు దక్కింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజాదరణ పొందిన వైశ్య ప్రతినిధులకు అందించే ఆర్యవైశ్య లైమ్‌లైట్–2024 మెన్ అవార్డు వేణుకు లభించింది. శనివారం రాత్రి హైదరాబాద్ ఫిలింనగర్ జేఆర్‌ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా గందె వేణు ప్రతిష్ఠాత్మకమైన అవార్డును అందుకున్నారు. లైమ్‌లైట్ అవార్డు కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 40 మంది ఆర్యవైశ్య ప్రముఖులు ఆన్‌లైన్ ఓటింగ్‌లో పాల్గొనగా, 6,325 ఓట్లతో వేణు మూడో స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ కాలువ సుజాత, ఐవీఎఫ్ ఇంటర్నేషనల్ కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, అవార్డు ప్రదానోత్సవ నిర్వాహకులు శివకుమార్, తెలుగు రాష్ట్రాల ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. కాగా, తన గెలుపుకోసం ఓటింగ్‌లో పాల్గొన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆర్యవైశ్యులకు అవార్డు గ్రహీత వేణు ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు జనగామకు చెందిన ప్రముఖులు అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న 'మిషన్ భగీరథ' సర్వే

కొడవటూరులో సర్వే చేస్తున్న రూపాచైతన్య

బచ్చన్నపేట, జూన్ 16 : మిషన్‌భగీరథ పథకంపై మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే కొనసాగుతున్నది. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. నల్లా కనెక్షన్ ఉన్నదా..? ప్రతి రోజూ తాగునీరు వస్తున్నదా..? అని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుంటున్నారు. ఎంపీడీవో రఘురామకృష్ణ ఆదివారం సైతం గ్రామాల్లో పర్యటించారు. ప్రతి రోజూ సుమారు 100 మందిని సర్వే చేస్తున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సర్వే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, వీవోఏ, ఫీల్డు అసిస్టెంట్లు బృంగి రూపాచైతన్య, అనిల్‌రాజ్, రాజశేఖర్, రాధాకృష్ణ, మోకు కవిత, ప్రశాంత్, మధు, ఉపేందర్, కిరణ్, భాను, శ్యామల, లలిత, మురళి, రాజేశ్వర్, కవి త, వాణి, భారతి, భరత్, శ్రీనివాస్, ప్రభాకర్, రాజు, సౌజన్య, దేవిప్రసాద్ పాల్గొన్నారు.

కుమార్‌ను సన్మానిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి

అసోసియేషన్ జిల్లా నాయకులు

చిల్పూరు, జూన్ 16 : ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని అసోసియేషన్ జిల్లా నాయకులు తెలిపారు. అసోసియేషన్ మండల స్థాయి సమావేశం ఆదివారం మల్కాపూర్‌లో కేశోజు రాజేంద్రచారి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి వలబోజు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కర్ణకంటి నాగరాజ్‌కుమార్ మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా నిలువాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వద్దుల కుమార్, ఉపాధ్యక్షుడిగా అకోజు పున్నంచందర్, ప్రధాన కార్యదర్శిగా అలుగు అశోక్, కార్యదర్శిగా ఎండీ ఖలీల్, సహాయ కార్యదర్శిగా నల్ల జేమ్స్, ప్రచార కార్యదర్శిగా పురమని శేఖర్, కోశాధికారిగా కలకోల్ల ఉపేందర్, సలహాదారుగా సోమ రవికుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జనార్దన్, వెంకటనారాయణ, తరిగొప్పుల మండల అధ్యక్షుడు నాము శ్రీనివాస్, వరప్రసాద్, రంగు రమేశ్, పిట్టల రాకేశ్, భరత్, రఘు శ్రావణ్, గణేశ్, శేఖర్ పాల్గొన్నారు.

ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావుకు పురస్కారం

ఐనవోలు, జూన్ 16 : తెలుగు సంస్కృతీ సాహితీ జాతీయ పురస్కారాన్ని ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థాన ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు అందుకున్నారు. ఈ మేరకు హనుమకొండలో ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చేతుల మీదుగా జాతీయ పురస్కారంతో పాటు అద్దంకి వసంత–నాగేశ్వర్‌రావు దంపతులకు స్వర్ణ నంది అందించారు. ఈ సందర్భంగా ఈవో నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తనను జాతీ య పురస్కారానికి ఎంపిక చేసిన తెలుగు సంస్కృతీ, సాహితీ సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ గౌరీశంకర్, ఎమ్మెల్యే నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

WANTED

jobs Apply Now!

★ Urgent Requirement for Corporate DSA Office Fresher & Exp. Female Tele-Callers, Quali: 12th & Best Talking Skills. Vacancies-30, Sal+Incentives etc., Job Location: HNK. Cont: 9032744373.
NTW-7701

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ట్రాన్స్‌కో సమస్యలపై నేడు ప్రజావాణి

తొర్రూరు, జూన్ 16: టీజీ ఎన్పీడీసీఎల్ సీఎం డీ ఆదేశాల మేరకు సోమవారం విద్యుత్ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని స్థానిక విద్యుత్ డీఈ మధుసూదన్ తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డివిజన్ కార్యాలయం, సబ్ డివిజన్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, సెక్షన్ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి, నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని చెప్పారు.

చిన్నపెండ్యాల బస్టాప్ వద్ద ఆగకుండా ముందుకు వెళ్తున్న బస్సు..

బస్సు వద్దకు పరుగులు తీస్తున్న మహిళలు..

ఆగని ఆర్టీసీ బస్సులు..

- బస్సు ట్రిప్పులు పెంచని అధికారులు
- సర్కారు తీరుపై మహిళల ఆగ్రహం

చిల్పూరు, జూన్ 16 : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నట్లు చెబుతున్న సర్కారు ప్రయాణికుల రద్దీకనుగుణంగా ట్రిప్పులు పెంచడం లేదు. ఫలితంగా మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీల పేర అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇందులో కేవలం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే అమలు చేస్తున్నది. అయితే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సు ట్రిప్పులు నడుపకపోవడంతో ఆడబిడ్డలు అరిగోస పడుతున్నారు. ఇందుకు నిదర్శనంగానే వరంగల్–హైదరాబాద్ హైవేపై మండలంలోని చిన్నపెండ్యాల వద్ద బస్‌స్టాప్ ఉన్నప్పటికీ కొన్నిసార్లు బస్సులను ఆపడం లేదు. దీనిపై ఆర్టీసీ సిబ్బందిని వివరణ కోరితే

అరిగోస పడుతున్న ఆడబిడ్డలు

ప్రయాణికుల రద్దీ పెరిగినందున కొన్ని సార్లు స్టేజీల వద్ద బస్సులను ఆపడం లేదని సమాధానమిస్తున్నారు. చిన్నపెండ్యాల నుంచి నిత్యం స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, హనుమకొండ, పాలకుర్తి, జఫర్‌గఢ్, తరిగొప్పుల రూట్లలో వందలాది మంది ప్రయాణిస్తుంటున్నారు. ఆర్డినరీ బస్సులను ఆపాల్సి ఉన్నా ప్రయాణికుల రద్దీ ఉందనే సాకుతో ఒక్కోసారి బస్సులు ఆపడం లేదు. కొన్నిసార్లు స్టేజికి దూరంగా సుమారు 100 మీటర్ల దూరంలో బస్సులను ఆపుతుండడంతో మహిళలు, వృద్ధులు అంత దూరం పరుగెత్తలేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినా ఆశించిన రీతిలో అమలు చేయడంలేదని విమర్శలొస్తున్నాయి. రద్దీకనుగుణంగా మరిన్ని బస్సులు నడుపాలని పలువురు ప్రయాణికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

బస్సు కోసం ఎండలోనే వేచి ఉన్న ప్రయాణికులు

చెయ్యెత్తినా బస్సు ఆపడం లేదు..

తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం బాగున్నా తగినన్ని ట్రిప్పులు వేయడం లేదు. చెయ్యెత్తిన చోట ఆర్టీసీ బస్సులు ఆపాలని అధికారుల ఆదేశాలున్నా అమలు కావడంలేదు. బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఉండడంతో డ్రైవర్లు ఆపకుండా తీసుకెళ్తున్నారు. దీంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. చేసేదేమీ లేక ఒక్కోసారి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నది.

- గజ్జెల రాధిక, రఘునాథపల్లి

ఒక్కోసారి బస్సులు ఆపడం లేదు..

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చాక మార్పు ఉందని చెబుతున్న నేతలకు మహిళల సమస్యలు పట్టడడం లేదు. మహిళలకు ఫ్రీ బస్సు అని చెప్పి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక బస్సుల ట్రిప్పులు పెంచడం లేదు. చిన్నచిన్న స్టేజీల వద్ద పల్లెవెలుగు బస్సులు ఆపడం లేదు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన మహిళలు ఎండలో బస్టాప్ వద్ద నిరీక్షిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా రూట్లలో బస్సుల సంఖ్య పెంచాలి.

-చింతపండు రేణుక, జనగామ

'రైతులకు పంట రుణాలు అందించాలి'

పాలకుర్తి, జూన్ 16: వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు సకాలంలో పంట రుణాలు అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున రైతులకు వెంటనే పంట రుణాలను అందించాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పెట్టుబడికి డబ్బుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారని ఆయన తెలిపారు. సన్న, చిన్నకారు రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్దకు అప్పుల కోసం వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నందున బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని సోమన్న కోరారు.

భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుంటున్న వరంగల్ కలెక్టర్

భద్రకాళీని దర్శించుకున్న కలెక్టర్ సత్యశారదాదేవి

వరంగల్, జూన్ 16 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదాదేవీ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆదివారం ఉదయం ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బోల్తాపడిన ట్యాంకర్

ఆయిల్ ట్యాంకర్ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

దామెర, జూన్ 16 : మండలంలోని ఊరుగొండ పెట్రోల్ బంక్ వద్ద వరంగల్ నుంచి భద్రాచలం వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి ఆయిల్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్ ఊరుగొండ పెట్రోల్ బంక్ వద్ద రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. ట్యాంకర్‌లోని ఆయిల్ రోడ్డుపై పడిపోగా, వాహనాలు స్కిడ్ కాకుండా స్థానికులు ఆ ప్రదేశంలో మట్టిని చల్లి ట్యాంకర్‌ను రోడ్డుపై నుంచి తొలగించారు. ఈ ఘటనలో హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామానికి చెందిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ బక్కడి సునీల్ (24) తీవ్రంగా గాయపడడంతో దవాఖానకు తరలించామని ఎస్సై కొంక అశోక్ తెలిపారు.

సిద్దెంకిలో రైతు పొలంలో ఏపుగా పెరిగిన జీలుగ

భూసారానికి జీలుగ జీవం

జనగామ రూరల్, జూన్ 16 : జీలుగతో భూసారం పెరిగి పంటలు అధిక దిగుబడులు వస్తాయి. అవగాహన లేక కొందరు రైతులు అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువులు ఇబ్బడిముబ్బడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా ఉత్పాదక వ్యయం గణనీయంగా పెరుగుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. దీనిని అధిగమించేందుకు ఏకైక ప్రత్యామ్నాయం సేంద్రియ ఎరువుల వినియోగమన్నారు. పచ్చిరొట్ట పైర్లను వినియోగించుకుని భూసారాన్ని పెంచుకోవాలని వారు సూచిస్తున్నారు. మండలంలోని సిద్దెంకిలో ఓ రైతు తన పొలంలో జీలుగ సాగు చేయడంతో పొలంలో ఏపుగా పెరిగి పచ్చగా కనువిందు చేస్తున్నది.

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిల్పూరు, జూన్ 16 : మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–1990 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాడు చదువుకునే రోజుల్లోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సింగారెడ్డి, లింగారెడ్డి, మాసిరెడ్డి, జనసేనరెడ్డి, వెంకటరమణారెడ్డిని సత్కరించారు. గనగోని రమేశ్ గౌడ్, నారగోని వెంకన్న, రాజశేఖర్, వైకుంఠం నేతృత్వంలో నిర్వహించిన ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు విరాజ్, రమేశ్, రావుల కేదారి, రేణుక, దేవిక, మంజుల, ఉమ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఎం

గోపాల్‌నగర్‌లో వెలిసిన గుడిసెలు

బచ్చన్నపేట, జూన్ 16 : పేదలకు స్థలాలిచ్చి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని సీపీఎం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని గోపాల్‌నగర్‌లోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 174లో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. గమనించిన పోలీసులు, రెవెన్యూ అధికారులు గుడిసెల వద్దకొచ్చి వాటిని తొలగించాలని కోరారు. దీనిపై సీపీఎం నాయకులు స్పంది స్తూ గుడిసెలను తొలగించే ప్రసక్తే లేదని, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని స్పష్టం చేశారు. జనగామ ఏసీపీ, సీఐ, తహసీల్దార్ ఇక్కడికి వచ్చి పేదలు, సీపీఎం నాయకులతో చర్చించినా ఫలించలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం మరికొంత మంది పేదలు వచ్చి కర్రలు పాతి గుడిసెలు వేశారు. సీపీఎం నాయకులు విజేందర్, వెంకటేశ్ మాట్లాడుతూ పేదల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా ఆదివారం సెలవు దినం కావడంతో పోలీసు, రెవెన్యూ అధికారులు ఎవరూ ఇక్కడికి రాలేదు.

హనుమకొండ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రావీణ్య

బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రావీణ్య

హనుమకొండ, జూన్ 16 : హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా పీ ప్రావీణ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన సిక్తా పట్నాయక్ నారాయణపేట్‌కు బదిలీపై వెళ్లగా, వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను హనుమకొండ జిల్లాకు బదిలీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్‌గా ప్రావీణ్య బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌ను అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, వెంకట్‌రెడ్డి, డీఆర్వో వైవీ గణేశ్, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రావీణ్య జిల్లా అధికారులతో కాసేపు ముచ్చటించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీమాబాద్, జూన్ 16: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ (ఎన్ఐఎఫ్‌డీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైనింగ్, ఫొటోగ్రఫీ వంటి వృత్తి విద్యా డిప్లొమా, డిగ్రీ అడ్వాన్స్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆర్థికంగా వెనుకబడి, ఆసక్తి ఉన్న వారు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టు ద్వారా ఫీజులో రాయితీ పొందొచ్చునని సంస్థ డైరెక్టర్ రాముయాదవ్ తెలిపారు. ఈ నెల 22, 23వ తేదీల్లో గ్రాండ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20లోగా 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. వివరాలకు www.nifdindia.in వెబ్‌సైట్ లేదా 9030610033, 9849167839లో సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కాజీపేట, జూన్ 16 : డీజిల్ కాలనీ చౌరస్తా సమీపంలో ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కాజీపేట సీఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. డీజిల్ కాలనీ చౌరస్తా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మసాగర్ గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు రొడ్డి శివకుమార్ (21) తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే అతడిని ఎంజీఎం దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. అతడి అక్క రాజకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన సోషల్ మీడియా ప్రతినిధి

కేసీఆర్‌తో వడ్లకొండ వినయ్‌కుమార్

దేవరుప్పుల, జూన్ 16: మండలంలోని నీర్మాలకు చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్లకొండ వినయ్‌కుమార్ ఆదివారం గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి మాట్లాడారు. అనంతరం వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యమ నేత కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సాంబయ్య

మంత్రాల పేరుతో దాడులు సరికాదు

నర్మెట, జూన్ 16 : ఆధునిక యుగంలో మంత్రాల పేరుతో దాడులు చేయడం సరికాదని, దీనిని భారత నాస్తిక సమాజం తీవ్రంగా ఖండిస్తున్నదని రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య అన్నారు. మంత్రాల నెపంతో మండల కేంద్రానికి చెందిన ఓ మహిళపై ఇటీవల దాడి జరిగిన నేపథ్యంలో ఆదివారం ఆయన ఇక్కడికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సాంబయ్య విలేకరులతో మాట్లాడారు. హైటెక్ యుగంలో మూఢనమ్మకాలను ఇంకా కొందరు నమ్ముతున్నారని, దీనిపై ప్రజలను చైతన్యవంతులను చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు చెరుపల్లి అనంద్, తుంగ రాములు, తూడి ప్రసాద్, నవీన్‌కుమార్, గంగారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు దేవరుప్పులలో 'విద్యుత్ ప్రజావాణి'

దేవరుప్పుల, జూన్ 16: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నేడు విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో సబ్ డివిజనల్ ఏడీ అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని సబ్ డివిజన్లు దేవరుప్పుల, సింగరాజుపల్లిలో ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. దేవరుప్పుల, సింగరాజుపల్లి సబ్‌స్టేషన్ల ఏఈలు హాజరై వినియోగదారుల సమస్యలను తెలుసుకుంటారని వివరించారు. విద్యుత్ బిల్లుల్లో తేడాలు, లూజ్ లైన్లు, లోవోల్టేజీ, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, ఓవర్‌లోడ్‌తోపాటు ఇతర సమస్యలను వినియోగదారులు లిఖితపూర్వకంగా తెలియజేస్తే పరిష్కరిస్తామని అనిల్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశంసా పత్రం అందుకుంటున్న రాకేశ్‌శర్మ

జాతీయ పురస్కారానికి ఎంపికైన రాకేశ్‌శర్మ

రఘునాథపల్లి, జూన్ 16: మండలంలోని కంచనపల్లికి చెందిన బత్తోజు రాకేశ్‌శర్మ అర్చక పురోహిత రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు తెలుగు సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ రావేసురారి పురస్కారాన్ని రాకేశ్‌శర్మకు అందించారు. సన్మాన గ్రహీత రాకేశ్‌శర్మ మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి అవార్డు అందించడం ఆనందంగా ఉందన్నారు. అవార్డు అందించిన ట్రస్టుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు కో–చైర్మన్ సోనిక్యూస్, డాక్టర్ మాచర్ల గౌరీశంకర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి

రమేశ్ (ఫైల్)

బచ్చన్నపేట, జూన్ 16 : ఆర్టీసీ జనగామ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మండల కేంద్రానికి చెందిన లక్కర్సు రమేశ్ (54) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అందరితో కలివిడిగా ఉండే రమేశ్ అకాల మృతి కుటుంబానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. అశ్రునయనాల మధ్య ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి కుటుంబాన్ని ఎంపీటీసీ సభ్యులు నల్లగోని పుష్పాబాలకిషన్‌గౌడ్, ఆల్వాల రాధ, ఎల్లయ్య, మాజీ సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి, కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత కొండి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు దిడ్డిగ రమేశ్, నర్సింగరావు, మహాత్మాచారి, కర్రె నరేశ్, రమేశ్, ఉపేందర్‌రెడ్డి, నరేందర్, షబ్బీర్, జావీద్, సిద్ధులు, వెంకటేశ్, వేణు పరామర్శించారు. ఆర్టీసీ ఉద్యోగులు మొలుగూరి రాజయ్య, వెంకట్‌రాజు, కిషన్, వెంకన్న, వీఎస్సార్, రెడ్డి, ఎల్ఎల్ పతి, పాకాల రజిత, జిల్లా శ్రీనివాస్, కనకయ్య, యుగేందర్, ఆయూబ్‌ఖాన్, రమేశ్, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్, యాదగిరి తదితరులు మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు.

మృతి చెందిన జీవాలు

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

దేవరుప్పుల, జూన్ 16: మండలంలోని చినమడూరుకు చెందిన మొటికె నర్సయ్యకు చెందిన నాలుగు గొర్రెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సయ్యకు చెందిన జీవాలు ఆదివారం అక్కినపల్లి రాములు బావి వద్ద ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తుండగా స్టే వైర్ తగిలింది. ఈ ఘటనలో నాలుగు జీవాలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని తెలిపారు. అధికారులు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్సై

తరిగొప్పుల, జూన్ 16 : బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై అయ్యాల శ్వేత అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో ఆమె సమావేశం నిర్వహించారు. సోమవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో గోవధ జరగకూడదన్నారు. పశువుల వధను సర్కారు నిషేధించిందని ఆమె పేర్కొన్నారు. తమ ఆచారాల ప్రకారం ముస్లింలు బక్రీద్ పండుగను ఆహ్లాదకరంగా జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా మత విద్వేషాలు రెచ్చగొడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.